


శివా.. శ్రీరామలింగేశ్వరా..

- కీసరగుట్టలో కనుల పండువగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
- రెండో రోజు శ్రీభవానీ రామలింగేశ్వరుడికి విశేష పూజలు
- నేడు మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి పెరిగిన భక్తుల తాకిడి



కీసర: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. వైదిక కార్యక్రమాల సంధానకర్త పుల్లేటికుర్తి గణపతిశర్మ ఆధ్వర్యంలో టీటీడీ వేద పాఠశాల విద్యార్థులు యాగశాల్లో యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని స్వామివారికి ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ అభిషేకం, సాయంత్రం స్వామివారికి వేదపండితులు బిల్వార్చన పూజ, గురువారం కీసర గ్రామానికి విచ్చేసిన స్వామివారిని కనుల పండువగా గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. శుక్రవారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవానికి కీసరగుట్టకు స్వామివారిని ఊరేగింపుగా తిరిగి తీసుకెళ్లారు.

మహాశివరాత్రికి కదిలిన భక్త జనం..

నేడు(శనివారం) మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారిని దర్శించుకునేందుకు నగరం నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆటోలు, సొంత వాహనాలు, ఆర్టీసీ బస్సుల్లో కుటుంబ సమేతంగా కీసరగుట్టకు చేరుకుంటున్నారు. కాగా గతంలో ఎడ్ల బండ్ల మీద కీసరగుట్టకు చేరుకునే యాప్రాల్, అమ్ముగూడ తదితర ప్రాంతాలకు చెందిన తమిళులు, ఎడ్ల బండ్లతో పాటు ఆటోలు, సొంత వాహనాల్లో గుట్టకు చేరుకున్నారు.

కళకళలాడిన పోచమ్మ అంగడి...

మహాశివరాత్రి ముందురోజు ప్రతియేట కీసరలో జరిగే పోచమ్మ అంగడి శుక్రవారం ఆనందోత్సవాల నడుమ జరిగింది. కాప్రా, యాప్రాల్ నగరం నలు మూలల నుంచి ముఖ్యంగా తమిళులు వివిధ వాహనాల్లో కీసరకు చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు తమ సాంప్రదాయాన్ని పాటిస్తూ ఎడ్ల బండ్లపై కీసరకు చేరుకుని పోచమ్మకు పూజలు చేసి అనంతరం కీసరగుట్టపైకి చేరుకున్నారు.

పటిష్ట బందోబస్తు...

బ్రహ్మోత్సవాల సందర్భంగా గుట్టలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. డ్వాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌లతో జాతర జరిగే ప్రాంతమంతా విస్తృతంగా తనిఖీలు చేశారు.

నేడు మహాశివరాత్రి పూజల వివరాలు...

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఆలయంలో ఉదయం 4 గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ఉదయం 6 గంటల నుంచి సాముహిక అభిషేకాలు, 9 గంటలకు రుద్ర స్వాహాకార హోమం, రాత్రి 8 గంటలకు నందివాహన సేవ, రాత్రి 10 గంటలకు భజనలు, రాత్రి 12 గంటలక రామలింగేశ్వరుడికి సతత ధారాభిషేకము (లింగోద్భవ కాలములో) నిర్వహించనున్నారు.

విద్యుత్ కాంతులతో విరాజిల్లుతూ...

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ కాంతులతో కొత్త అందాలను తీసుకువచ్చారు. ఆలయంతో పాటు ఆలయ ప్రాంగణంలోనూ రంగు రంగుల విద్యుద్దీపాలతో కీసరగుట్ట ప్రాంగణాన్ని శోభాయమాణం చేశారు.

కొనసాగుతున్న క్రీడలు...

కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల జిల్లా స్థాయి క్రీడలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గుట్టలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ సమీపంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్ క్రీడల్లో తలపడుతున్నారు. పోటీలను తిలకించేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలివస్తున్నారు.

శివరాత్రికి శైవక్షేత్రాలు సిద్ధం

- పూలు, పండ్లతో మార్కెట్లు కిటకిట
- విద్యుత్ కాంతులతో ఆలయాల అలంకరణ
- భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీల ఏర్పాట్లు

మేడ్చల్: ఉపవాస దీక్షలు ఉండి పరమశివుడిని అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిసే మహాశివరాత్రి పండగకు శైవక్షేత్రాలు సిద్ధమయ్యాయి. ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో ఆలయాలను శుద్ధి చేసి పూలు, పచ్చటి తోరణాలతో.. విద్యుత్ కాంతులతో.. అందంగా అలంకరణ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. అత్వెల్లిలోని చందరమౌళేశ్వర, రాజరాజేశ్వరి, మేడ్చల్ కీసరగుట్ట శ్రీభావానీ రామలింగేశ్వర, కేఎల్‌ఆర్ మల్లికార్జున తదితర ఆలయాలను నిర్వాహకులు ముస్తాబు చేశారు.

మార్కెట్లు కిటకిట...

ఉపవాస దీక్షలు తీసుకుని సాయంత్రం పండ్లు తినే సంప్రదాయం ఉంటడంతో మార్కెట్‌లో పండ్లకు విపరీతంగా గిరాకీ పెరిగింది. పండ్లను మాములు రోజుల కన్నా రెట్టింపు ధరలకు వ్యాపారులు విక్రయించారు. కొనుగోలుదారులతో మార్కెట్లలో పండగ శోభ సంతరించుకుంది.



మూలవిరాట్‌కు పూజలు..



కొనసాగుతున్న క్రీడాపోటీలు



యజ్ఞశాలలో కలశ పూజ



మేడ్చల్ మార్కెట్‌లో పండగ సందడి

ఘనంగా మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది జన్మదిన వేడుకలు



మలిపెద్ది సుధీర్‌రెడ్డికి కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలుపుతున్న నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి 71వ జన్మదిన వేడుకలు నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నాగారం మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నేతలు పెద్ద ఎత్తున సుధీర్‌రెడ్డి నివాసానికి తరలివెళ్లి ఆయనచే కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, కౌన్సిలర్లు కొకుట్ల అనంతరెడ్డి, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, సుర్వి శ్రీనివాస్‌గౌడ్, కొకుట్ల మమత కృష్ణారెడ్డి, అన్నంరాజు సుమిత్ర సురేష్, అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు ఆదాం షఫి, యూత్ అధ్యక్షుడు కొకుట్ల రాహుల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతాపుసింగారంలో...

ఘట్‌కేసర్: మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రతాపుసింగారంలో శుక్రవారం జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, జెడ్పీ సీఈఓ దేవసహాయం, ఎంపీడీఓ అరుణారెడ్డి, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు ఆయనతో కేట్ కట్ చేయించి పూలమాలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా 50 మంది రక్తం దానం చేశారు.



మలిపెద్ది సుధీర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దండి



ఘట్‌కేసర్: విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడం అధ్యాపకుల చేతిలోనే ఉందని అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ) ఉప కులపతి రాంచంద్రం అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం ముగిసిన 'కృత్రిమ మేధస్సు' అధ్యాపకుల సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అధ్యాపకులు కృత్రిమ మేధస్సుతో పోటీ పడే విధంగా విద్యార్థులను అన్ని రంగాల్లో ముందుకు నడిపించాలని, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు అధ్యాపకులు మార్గ నిర్దేశకులు కావాలన్నారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఫాతిమా, డాక్టర్ విజయ్‌కుమార్, కృష్ణానంద్, మనోరంజన్‌దాస్, తెలంగాణ, ఏపీలతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమయాన్ని వృథా చేయొద్దు



ఘట్‌కేసర్: పట్టణంలోని నారాయణ గార్డెన్‌లో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం మోటివేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ట్రస్మా మోటివేషనల్ స్పీకర్ సతీశ్, ముఖ్య అతిథి విజయకుమారి, గౌరవ అతిథులు యాదగిరి, అజహర్‌ఖాన్, నాగరాజు, ఎల్‌ఎస్ రెడ్డి, జీవెడ్ హుస్సేన్‌లు పదో తరగతి పరీక్షల్లో ఎలా చదవాలో విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ట్రస్మా మండలాధ్యక్షుడు పి.అంజన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పరిశ్రమలకు విద్యుత్ బంద్

మేడ్చల్: మేడ్చల్ చెక్ పోస్ట్ పరిధిలో గల పారిశ్రామికవాడలోని పరిశ్రమలకు శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, మేడ్చల్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల నరికివేత కారణంగా కరెంట్ కోతలు విధిస్తున్నట్లు ఆయన చెప్పారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన ఐదుగురు లబ్దిదారులకు రూ.2.58 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి మున్సిపల్ కార్యాలయంలో పంపిణీ చేశారు. వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, మల్లికార్జున్ ముదిరాజ్, హేమంత్‌రెడ్డి, బాలరాజు, వీణ సురేందర్‌గౌడ్, రజిత వెంకటేశ్, అంటోనమ్మఫిలిప్స్ పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



వృద్ధురాలికి కంటి అద్దాలు అందజేస్తున్న ఎంపీపీ

మేడ్చల్: కంటి సమస్యల నివారణకు ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి అన్నారు. గౌడవెళ్లి గ్రామంలో జెడ్పీటీసీ శైలజా విజయానంద్‌రెడ్డి, సర్పంచ్ సురేందర్ ముదిరాజ్‌లతో కలిసి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో అవసరమైన వారికి ఆమె కళ్లద్దాలను అందజేశారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఏడో వార్డు గుంటిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. కంటి పరీక్షల అనంతరం అవసమైన వారికి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లేశ్, రవీందర్, మాజీ వార్డు సభ్యుడు దేవేందర్‌ముదిరాజ్, జంగయ్యయాదవ్, నర్సింగ్‌రావు, విజయ్, డాక్టర్ ఫణీందర్‌రెడ్డి, పీహెచ్‌ఎన్ విమలారెడ్డి, డీఈఓ సాత్విక్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్ పావనీయాదవ్

ఘనంగా సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు



ఎకో పార్కులో కేసీఆర్ పుట్టిన రోజు కేక్‌కట్ చేస్తున్న ఎంపీ సంతోష్‌కుమార్, మంత్రి మల్లారెడ్డి



మొక్కలు నాటుతున్న ఎంపీ సంతోష్ కుమార్, మంత్రి మల్లారెడ్డి తదితరులు

కీసరలో ఎంపీ జోగినపల్లి, మంత్రి మల్లారెడ్డి..

కీసర: సీఎం కేసిర్ పుట్టినరోజును పురస్కరించుకుని కీసరగుట్టలో శ్రీరామలింగేశ్వరుడి ఆలయంలో ఎంపీ సంతోష్‌కుమార్, మంత్రి మల్లారెడ్డితో కలిసి శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ పండితులు వారికి ఆశీర్వచనంతో పాటు ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీఎం కేసీఆర్ పుట్టినరోజు కలిసి రావడం సంతోషంగా ఉందని, సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని భగవంతుడిని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా కీసర పెద్దమ్మ చెరువు సమీపంలో గల అర్బన్ ఎకో పార్కులో మంత్రి మల్లారెడ్డితో కలిసి ఎంపీ సంతోష్‌కుమార్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీర్జాదిగూడ, బోడుప్పల్, జవహర్‌నగర్, మేయర్లు జక్క వెంకట్ రెడ్డి, బుచ్చిరెడ్డి, మేకల కావ్య, నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మన్లు కొకుట్ల చంద్రారెడ్డి, వసుపతి ప్రణీతాగౌడ్, ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ, కీసర సర్పంచ్ నాయకపు వెంకటేష్,, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, నాయకులు నాయకపు వెంకటేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



కీసరగుట్టలో సీఎం కేసీఆర్ పేరు మీద పూజలు చేస్తున్న ఎంపీ సంతోష్‌కుమార్, మంత్రి మల్లారెడ్డి



ఘట్‌కేసర్: మొక్కలు నాటుతున్న చైర్‌పర్సన్ పావని

బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పుట్టిన రోజు వేడుకలు మేడ్చల్ నియోజకవర్గంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా నియోజకవర్గం వ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని అన్నదానాలు, రక్తదానాలు, నిరుపేదలు, అనాథలకు పండ్లు ఇతరత్రాల పంపిణీ, మొక్కలు నాటడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఉద్యమ తీరును, రాష్ట్రం ఆవిర్భవించిన అనంతరం తెలంగాణ అభివృద్ధిలో కేసీఆర్ చేసిన, చేస్తున్న కృషిని పలువురు అభివర్ణించారు.

– మేడ్చల్ జోన్ బృందం



మేడ్చల్: గౌడవెళ్లిలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ, సర్పంచ్ సురేందర్



మేడ్చల్: అత్వెల్లి 3వ వార్డులో కౌన్సిలర్ దేవ ఆధ్వర్యంలో...